

ఈ ఏడాది గణతంత్ర దినోత్సవ వేళ కేంద్ర ప్రభుత్వం పద్మ పురస్కారాలను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ పురస్కారాల ప్రదానోత్సవం ఢిల్లీ రాష్ట్రపతి భవన్‌లో సోమవారం ఘనంగా జరిగింది. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో.. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మ చేతుల మీదుగా అగ్ర నటుడు నందమూరి బాలకృష్ణ 'పద్మభూషణ్' పురస్కారాన్ని అందుకున్నారు. తెలుగుదనం ఉట్టిపడేలా పంచకట్టులో ఆయన ఈ వేడుకకు హాజరవ్వడం విశేషం. అలాగే, తమిళ అగ్ర నటుడు అజిత్ కూడా పద్మభూషణ్ పురస్కారాన్ని అందుకున్నారు.



# అప్పట్లో నాకు అదే పెద్ద సమస్య



'సంక్రాంతికి వస్తున్నాం' హిట్‌తో జోష్ మీదున్నారు అందాలభామ మీనాక్షి చౌదరి. ప్రస్తుతం నవీన్ పోలిశెట్టి 'అనగనగా ఒక రాజు' సినిమాలో నటిస్తూ బిజీగా ఉన్నారామె. కాలేజీ రోజుల్లో తాను ఎదుర్కొన్న ఓ సమస్య గురించి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికరంగా చెప్పుకొచ్చారు మీనాక్షి. 'కాలేజీ రోజుల్లో చాలామంది నాతో డిస్టెన్స్ మెయింటైన్ చేసేవారు. ప్రత్యేకంగా చూసేవారు. దాంతో నేను కూడా ఇతరులతో ఫ్రీగా ఉండలేకపోయేదాన్ని. మాట్లాడటానికి కూడా ఇబ్బంది పడేదాన్ని. దానికి బలమైన కారణం ఉంది. అదేంటంటే.. ఆ రోజుల్లోనే నా ఎత్తు 6.2. దాంతో నా పక్కన నడిచేందుకు ఫ్రెండ్స్ ఇష్టపడేవారు కాదు. అబ్బాయిలైతే డిస్టెన్స్ మెయింటెన్ చేసేవాళ్లు. అప్పట్లో నా ఎత్తే నాకు అతిపెద్ద సమస్య. ఓ రోజు నాన్నకు నా సమస్యను వివరించా. ఆయన ఆర్మీ ఆఫీసర్. ఏదైనా నిర్మొహమాటంగా చెప్పేస్తారు. 'నీ సమస్యను నువ్వే పరిష్కరించుకో..' అని సింపుల్‌గా సెలవిచ్చారు. అప్పటినుంచే నా గురించి నేను ఆలోచించడం మొదలుపెట్టా. ఆ క్రమంలోనే అందాల పోటీల్లో పాల్గొన్నా. నటిగా మారా. వచ్చిన ప్రతి అవకాశాన్నీ సద్వినియోగం చేసుకుంటూ ఇక్కడిదాకా వచ్చా.' అంటూ చెప్పుకొచ్చారు మీనాక్షి చౌదరి.

# సెంటిమెంట్ వర్కవుట్ అయితే హిట్ పక్కా!



చిరంజీవి కొత్త సినిమా కోసం ఓవైపు అభిమానులంతా ఎదురుచూస్తుంటే.. అనిల్ రావిపూడి తనతో షూట్ ఎప్పుడు మొదలుపెడతాడా? ఆ సెట్‌లోకి తానెప్పుడు ఎంట్రీ ఇస్తానా.. అని మెగాస్టార్ ఎదురు చూస్తున్నారు. ఈ విషయాన్ని స్వయంగా ఆయనే తెలియజేశారు. 'ఈ కథలోని సీన్స్‌ని అనిల్ వివరిస్తుంటే నవ్వు ఆపుకోలేకపోయా. ఈ మూవీ సెట్‌లోకి ఎప్పుడు అడుగు పెడతానా.. అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నా.' అని చిరంజీవి అన్నారు. ప్రస్తుతం అనిల్ ఈ సినిమా సెకండ్ హాఫ్ స్క్రిప్ట్ పనిమీద వైజాగ్‌లో ఉన్నారు. కథ రీత్యా సెకండ్ హాఫ్‌లో చిరంజీవి పాత్ర వైవిధ్యంగా ఉంటుందట. చిత్తూరు యాసతో డిఫరెంట్ బాడీ లాంగ్వేజ్‌తో మెగాస్టార్ కనిపిస్తారట. దానికోసం అనిల్ ప్రస్తుతం కసరత్తులు చేస్తున్నారు. ఇందులో కథానాయికగా నయనతార ఖరారైనట్టు వార్తలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ సినిమాకోసం ఆమె భారీ పారితోషికాన్ని డిమాండ్ చేశారట. అలాగే ఈ కథలో సిస్టర్ పాత్ర చాలా కీలకమని తెలుస్తున్నది ఆ పాత్రను నటి జ్యోతిక పోషించనున్నట్టు సమాచారం. వీరిద్దరూ కలిసి రజనీకాంత్‌తో నటించిన 'చంద్రముఖి' బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. ఇప్పుడు చిరంజీవితో వీరిద్దరూ కలిసి నటించబోతున్నారు. ఇది కూడా పక్కా హిట్ అని అభిమానులు నమ్మకం వ్యక్తం చేస్తున్నారు.

# మహాభారతంలో ఆ ముగ్గురు?



దర్శకధీరుడు రాజమౌళి జీవితాశయం 'మహాభారతం'. ఈ విషయాన్ని ఆయనే పలు సందర్భాల్లో చెప్పారు. 'మహాభారతం' తీయడం తన జీవితాశయమని, కాకపోతే దాన్ని తెరకెక్కించాలంటే ప్రస్తుతం తనకున్న అనుభవం చాలదని, మహాభారతాన్ని ఒకట్రెండు భాగాల్లో చెప్పలేమని.. కనీసం అయిదారు భాగాలన్నా తీయాల్సుంటుందని పలు సందర్భాల్లో రాజమౌళి అన్నారు. అయితే.. ఇటీవల ఓ నేషనల్ చానల్ ఇంటర్వ్యూలో 'మహాభారతం' గురించి రాజమౌళి చెప్పిన విషయాలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. దాంతో రాజమౌళి 'మహాభారతం' ఇప్పుడు మళ్లీ హాట్ టాపిక్‌గా మారింది. 'మీరు మహాభారతం తీస్తే.. ఏఏ పాత్రలకు ఎవర్ని తీసుకుంటారు?' అన్న ప్రశ్నకు రాజమౌళి సమాధానమిస్తూ.. 'శ్రీకృష్ణ పాత్రకు తారక్‌ని తీసుకుంటా. ఎందుకంటే ఆ పాత్రను తన స్థాయిలో ఎవరూ రక్తికట్టించలేరు. అతనిలో వాళ్ల తాతగారి పోలికలుంటాయి. అతన్ని కృష్ణుడిగా ఆడియన్స్ అంగీకరిస్తారు. అలాగే.. కర్ణుడిగా ప్రభాస్‌ను తప్ప మరొకర్ని ఊహించలేను.' అని తెలిపారు. రీసెంట్‌గా జరిగిన 'హిట్ 3' వేడుకలో 'నా మహాభారతంలో నాని కూడా ఉంటాడు. అయితే ఏ పాత్రో చెప్పను.' అని వేలాది మంది సమక్షంలో ప్రకటించారు రాజమౌళి. దాంతో నానిని రాజమౌళి ఏ పాత్రకు అనుకుంటున్నారు? అనేది హాట్ టాపిక్‌గా మారింది. మొత్తంగా రాజమౌళి 'మహాభారతం'లో ఎన్టీఆర్, ప్రభాస్, నాని కన్‌ఫార్మ్ అయ్యారన్నమాట. ఇంకెంతమంది హీరోలు ఈ ప్రస్టేజియస్ ప్రాజెక్టులో భాగం అవుతారో చూడాలి.

# మిస్టరీ కిష్కింధపురి



హీరో బెల్లంకొండ సాయిశ్రీనివాస్ నటిస్తున్న హారర్ మిస్టరీ 'కిష్కింధపురి'. అనుపమ పరమేశ్వరన్ కథానాయిక. కౌశిక్ పెగల్లపాటి దర్శకుడు. సాహు గారపాటి నిర్మాత. ప్రస్తుతం ఈ సినిమా నిర్మాణ దశలో ఉంది. ఈ నేపథ్యంలో ఆదివారం ఈ సినిమా టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. మైథాలజీ గ్రాండియర్‌నీ, ఓ మిస్టరీని ఈ టైటిల్ సూచిస్తున్నది. బెల్లకొండ సాయిశ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్‌లు చేతిలో టార్చ్‌లు పట్టుకొని అడవిలో ఏదో వెతుకుతూ.. ఎక్సయిటింగ్ ఎక్స్‌ప్రెషన్స్‌తో పోస్టర్‌లో కనిపిస్తున్నారు. బ్యాగ్రౌండ్‌లో కనిపిస్తున్న పాడుబడ్డ బంగ్లా కథపై ఆసక్తిని రేకెత్తిస్తున్నది. ఈ నెల 29న ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్ విడుదల చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రానికి కెమెరా: చిన్మయ్ సలాస్కర్, సంగీతం: సామ్ సిఎస్, సమర్పణ: శ్రీమతి అర్చన, నిర్మాణం: షైన్ స్క్రీన్స్.

# నవ్వించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం

'దర్శకుడు ఈ కథ చెప్పినప్పుడు రెండు గంటల పాటు పగలబడి నవ్వుతూనే ఉన్నా. అంత అద్భుతంగా అనిపించింది. ఫ్యామిలీ అంతా కలిసి థియేటర్స్‌లో హాయిగా ఎంజాయ్ చేసే సినిమా ఇది' అన్నారు అగ్ర నిర్మాత అల్లు అరవింద్. ఆయన సమర్పణలో రూపొందిన చిత్రం 'సింగిల్'. శ్రీవిష్ణు, కేతిక శర్మ, ఇవానా జంటగా నటించిన ఈ చిత్రానికి కార్తీక్‌రాజు దర్శకుడు. విద్యా కొప్పినీడి, భానుప్రతాప్, రియాజ్ చౌదరి నిర్మాతలు. మే 9న విడుదలకానుంది. సోమవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. ముక్కోణపు ప్రేమకథా నేపథ్యంలో ట్రైలర్ ఆసాంతం నవ్వుల్ని పంచింది. ఈ సందర్భంగా శ్రీవిష్ణు మాట్లాడుతూ..ప్రేక్షకుల్ని ఇరగబడి నవ్వించాలనే లక్ష్యంతో ఈ సినిమా చేశామని, రెండున్నర గంటలు హ్యాపీగా ఎంజాయ్ చేస్తారని అన్నారు. ప్రేక్షకుల్ని పొట్టచెక్కలయ్యేలా నవ్వించే చిత్రమిదని, గీతా ఆర్ట్స్‌లో కామెడీ సినిమాలు ఎప్పుడూ ఫెయిల్ కాలేదని నిర్మాత బన్నీ వాసు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు. ఈ చిత్రానికి విశాల్‌చంద్రశేఖర్ సంగీతాన్నందించారు.





# పూరీ సినిమాలో మరో స్టార్

విజయ్ సేతుపతి కథానాయకుడిగా పూరీ జగన్నాథ్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా ప్రకటన వెలువడ్డ నాటి నుంచి సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి మొదలైంది. ఆ ఆసక్తిని రెట్టింపు చేస్తూ సోమవారం మేకర్స్ ఓ ప్రకటన విడుదల చేశారు. కన్నడ స్టార్ దునియా విజయ్ ఇందులో ఓ పవర్‌ఫుల్ పాత్ర పోషించనున్నట్టు ఈ ప్రకటనలో వారు తెలియజేశారు. బాలయ్య బ్లాక్‌బస్టర్ 'వీరసింహారెడ్డి'లో పవర్‌ఫుల్ విలన్‌గా నటించి ప్రేక్షకుల నుంచి మంచి మార్కులే సాధించారు దునియా విజయ్. ఇప్పుడు పూరీ, విజయ్ సేతుపతి సినిమా ద్వారా రెండోసారి తెలుగుతెరపై కనిపించబోతున్నారాయన. ఇందులో విజయ్ సేతుపతి నెవర్ బిఫోర్ అనిపించేలా అవుట్ స్టాండింగ్ అవతార్‌లో కనిపించబోతున్నారని, టబు కథలో కీలకమైన పాత్రను పోషిస్తున్నారని, దునియా విజయ్ భాగం అవ్వడంతో ఈ ప్రాజెక్ట్‌కి మరింత బలం చేకూరినట్టయ్యిందని మేకర్స్ తెలిపారు. జూన్ నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. ఈ చిత్రాన్ని చార్మి కౌర్‌తో కలిసి పూరీ జగన్నాథ్ నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

# తనతో మాట్లాడకపోతే తోచదు



దేశం గర్వించదగ్గ మహానటుల్లో మోహన్‌లాల్ ఒకరు. తను మలయాళీ నటుడైనా.. అన్ని భాషల్లోనూ ఆయన నటనకు అభిమానులున్నారు. ప్రస్తుతం హృదయపూర్వం, హృషభ, దృశ్యం 3 చిత్రాలతో బిజీగా ఉన్నారు మోహన్‌లాల్. తెలుగులో ఆయన ప్రత్యేక పాత్ర పోషించిన 'కన్నప్ప' చిత్రం త్వరలో విడుదల కానుంది. ఇదిలావుంటే.. ఇటీవల ఆయన ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఆ ఇంటర్వ్యూలో కొన్ని ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు మోహన్‌లాల్. 'శరీరంలో సత్తువ ఉన్నంత వరకూ మనిషి పనిచేయాలి. ఆరోగ్యంగా ఉండి కూడా విశ్రాంతి తీసుకునేవాళ్లను సోమరిపోతులు అంటారు. నావరకూ నేను ఎప్పుడూ బిజీగా ఉంటా. ఒక సినిమా చేస్తూ నాలుగు సినిమాలకు ఓకే చెబుతుంటా. పనిచేస్తూ ఉండటం నాకిష్టం.' అని చెప్పుకొచ్చారు మోహన్‌లాల్. తన కోరిక గురించి చెబుతూ 'మమ్ముట్టికీ, నాకూ మధ్య పోటీ ఉందని అందరూ అనుకుంటారు. నిజానికి మా మధ్య ఉన్నది పోటీ కాదు.. స్నేహం. తను నా ప్రాణ స్నేహితుడు. రోజుకి ఒక్కసారైనా తనతో మాట్లాడకపోతే నాకు తోచదు. తనక్కూడా అంతే. మేమిద్దరం కలిసి ఇప్పటికి 50 సినిమాల్లో నటించాం. ఇంకా మరిన్ని చిత్రాల్లో తనతో కలిసి నటించాలనేది నా కోరిక.' అన్నారు మోహన్‌లాల్.

# అందుకే వయసు కనిపించదు!



బాలీవుడ్ అగ్ర నటుడు షారుఖ్‌ఖాన్ 59 ఏళ్ల వయసులో కూడా ఫిట్‌గా కనిపిస్తారు. ముఖంలో కూడా వయసు తాలూకు ఛాయలు ఏమాత్రం కనిపించవు. ఇప్పటికీ సిక్స్‌ప్యాక్ మెయిన్‌టెయిన్ చేసే అగ్రహీరోల్లో ఆయన ఒకరు. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన ఫిట్‌నెస్ రహస్యాలు, ఆహారపు అలవాట్ల గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. ధూమపానం మానేసినప్పటి నుంచి తన ఆరోగ్యంలో పాజిటివ్ మార్పులు చోటుచేసుకున్నాయని, అలాగే మితాహారం తీసుకోవడం వల్ల శరీర ఆకృతిని ఒకే రీతిన ఉంచుకోవడం వీలవుతున్నదని చెప్పారు. 'నేను రోజూ రెండు పూటలు మాత్రమే భోజనం చేస్తా. చిరుతిళ్ల జోలికి అస్సలు వెళ్లను. ఆహారంలో కూడా తృణధాన్యాలు, గ్రిల్డ్ చికెన్, బ్రోకోలి, పప్పుతో చేసే కూరలు ఎక్కువగా ఉండేలా చూసుకుంటా. భోజనం చాలా సింపుల్‌గా ఉంటేనే ఇష్టపడతా' అని చెప్పారు. అయితే ఎక్కడికైనా అతిథిగా వెళ్లినప్పుడు మాత్రం వారు ఆఫర్ చేసినవన్నీ వొద్దనకుంటా ఆరగిస్తానని, ఆతిథ్యం స్వీకరించినప్పుడు ఇతరులను నొప్పించడం సరికాదని షారుఖ్‌ఖాన్ చెప్పుకొచ్చారు. అన్నింటికంటే ముఖ్యంగా తాను కేవలం ఐదు గంటలు మాత్రమే నిద్రపోతానని, షూటింగ్ ముగించుకొని ఎంత రాత్రి ఇంటికొచ్చినా ఓ గంట సేపు వర్కవుట్స్ చేశాకే నిద్రకు ఉపక్రమిస్తానని షారుఖ్ తెలిపారు. మితాహారం తీసుకుంటూ, వారానికి నాలుగైదుసార్లు వర్కవుట్స్ మీద దృష్టిపెడితే వయసును దాచడం ఎవరికైనా పెద్ద సమస్యకాదని ఆయన చెప్పారు.

# లాబీయింగ్‌తోనే జాతీయ అవార్డులు!

జాతీయ అవార్డులపై బాలీవుడ్ సీనియర్ నటుడు పరేష్ రావల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. వాటి ఎంపికలో అవినీతి, లాబీయింగ్ ఎక్కువగా జరుగుతుంటాయన్నారు. ఇటీవల ఓ జాతీయ పత్రికకు ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో ఆయన ఈ కామెంట్స్ చేశారు. తాను నటించిన 'సర్' (1993), 'సర్దార్' (1993) చిత్రాలు జాతీయ అవార్డులను గెలుచుకున్నాయని, ఆ సమయంలోనే అవార్డుల ఎంపికలో అవకతవకల గురించి తెలుసుకున్నానని తెలిపారు. అయితే తాను జాతీయ అవార్డులను గౌరవిస్తానని, ఎంపిక ప్రక్రియపై మాత్రం అభ్యంతరాలున్నాయని పరేష్ రావల్ అభిప్రాయపడ్డారు. 'సినిమాలను జాతీయ అవార్డులకు పంపించే ముందు కొన్ని సాంకేతికాంశాలను పరిశీలించాల్సి ఉంటుంది. దరఖాస్తులను సరిగ్గా పొందుపరచని పక్షంలో సినిమాలు తిరస్కరణకు గురవుతాయి. ఈ ప్రక్రియే గందరగోళంగా అనిపిస్తుంది. ఆస్కార్ అవార్డుల్లోనే లాబీయింగ్ జరుగుతున్నప్పుడు, ఇక్కడి జాతీయ అవార్డుల్లో జరగడం పెద్ద విషయమేం కాదు.' అని పరేష్ రావల్ అభిప్రాయ పడ్డారు. తన నటనను నసీరుద్దీన్‌షా, ఓంపురి వంటి లెజెండరీ యాక్టర్స్ మెచ్చుకున్న సందర్భాల్లో తాను జాతీయ అవార్డును గెలిచిన దానికంటే ఎక్కువగా ఆనందపడ్డానని, వారి మాటలకు ఏ అవార్డులూ సరితూగవని పరేష్ రావల్ పేర్కొన్నారు.





హీరో శర్వానంద్ కెరీర్‌లో తొలి పానిండియా సినిమాకు రంగం సిద్ధమైంది. సంపత్‌నంది దర్శకుడు. శ్రీసత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కె.కె.రాధామోహన్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ప్రతిష్టాత్మకంగా నిర్మించబడుతున్న ఈ పానిండియా సినిమా ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉంది.

# శర్వా38లో డింపుల్

ఇందులో అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. అయితే.. ఇందులో ఓ క్రూషియల్ రోల్ కోసం డింపుల్ హయాతిని ఎంపిక చేశారు దర్శకుడు సంపత్‌నంది. కథలో చాలా కీలకంగా ఈ పాత్ర ఉంటుందని, ఈ పాత్రకు డింపుల్ పర్ఫెక్ట్‌గా సరిపోతుందని మేకర్స్ చెబుతున్నారు. 1960లో ఉత్తర తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దుల్లో జరిగిన యధార్థ గాధ ఆధారంగా ఈ సినిమా రూపొందనున్నది. త్వరలోనే షూటింగ్ ప్రారంభిస్తామని, తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో కూడా సినిమాను విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సమర్పణ: లక్ష్మీ రాధామోహన్.



# అమెరికా నుంచి శ్రీకారం

మంచు విష్ణు టైటిల్ రోల్‌లో నటిస్తున్న భక్తిరస ప్రధాన చిత్రం 'కన్నప్ప' చిత్రం జూన్ 27 ప్రేక్షకుల ముందుకురాబోతున్న విషయం తెలిసిందే. ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు. ఇందులో మోహన్‌లాల్, మోహన్‌బాబు, అక్షయ్‌కుమార్, ప్రభాస్, కాజల్ అగర్వాల్ వంటి అగ్ర తారలు భాగమయ్యారు. ఈ సినిమా ప్రమోషన్స్‌ను మే8 నుంచి అమెరికాలో మొదలుపెట్టబోతున్నారు. న్యూజెర్సీలో రోడ్‌షోతో ప్రచార పర్వానికి శ్రీకారం చుట్టి, డల్లాస్, లాస్‌ఏంజిల్స్‌లో భారీ ఈవెంట్స్‌ను నిర్వహించబోతున్నామని మేకర్స్ తెలిపారు. 'ప్రేక్షకుల్లో భక్తి భావాల్ని పెంపొందించే చిత్రమిది. పాటలు, విజువల్స్ ఆకట్టుకునేలా ఉంటాయి. ఇండియాతో పాటు అమెరికాలో కూడా భారీ రిలీజ్‌కు సన్నాహాలు చేస్తున్నాం' అని మేకర్స్ తెలిపారు.

